# 33. పోటీ ప్రజా సేవలు

"నశించాలి" అన్నాడు సుబ్రావు బల్ల గుద్ది.

బల్ల మీద ఏమీ లేవు. కనుక ఏదీ ఎగిరి నామీదపడ లేదు.

'అవును! నశించాలి" అన్నానేనను కూడా బల్ల గుద్ది.

ఆ బల్ల నాదీకాదు, వాడిదీకాదు. హోటలు వాడిది.

'ఏమిటీ?' ప్రశ్నించేడు సుబ్రావు.

"అవును! నశించాల్సిందే!" అన్నాను, మళ్ళీ ఓ సారి బల్ల గుద్ది నా విప్లవ తత్వాన్ని రుజూ చేసుకుంటూ.

'ఏం నశించాలంటావూ?'

'బాగుంది! నాకేం తెలుస్. ఇందాక నువ్వేదో నశించాలంటున్నావు గదా? నేనూ డిటో!'

సుబ్రావు ఆలోచించేడు.

'ఏం నశించాలన్నా నబ్బా! ఆ...ఆ! గుర్తుకొచ్చింది. మనం అకాడమీని తగలెయ్యాలి!"

"అకాడమీనా! కష్టమేనే?"

సుబ్రావు గుర్రుమన్నాడు.

"ఏం! అగ్గిపుల్లల్లేవా?" అనరిచేడు.

"బాబ్బాబు, మరేదన్నా పాకగానీ, గడ్డివామిగానీ చూద్దూ! అకాడమీని తగలేయాలంటే కష్టం మూడంతస్తుల సిమ్మెంటు మేడలో వుంది గదా" అన్నానేన్నెను ప్రాధేయ పడుతూ.

"ఏం! బజార్లో పెట్రోల్ దొరకటం లేదా?"

"బజార్లో కాదుగానీ బంకుల్లో దొరుకుతోంది. నాలుగు రూపాయలకో లీటర్ ఇస్తున్నారు."

"మరింకేం! ఇంతకీ నీ జేబులో ఏ మాత్రం వుంది!"

"ఏమిటీ! పెట్రోలా?"

"కాదు! పెట్రోలుకు పైసలు!"

"ఎబ్బె! నెలాఖరు గదా! సాయంత్రం బస్సుకో పావలా వున్నట్టుంది!"

సుబ్రావు నిట్టూర్చేడు. "ఏం మనుషుర్రా బాబూ! ఒక్క మగవెధవా కనపడి చావడుగదా!" అని విసుక్కున్నాడు

సుబ్రావును ఓదార్చాను. "నిరాశ పడకు. నువున్నావు గదా! నేను కూడా వున్నాననుకో!" అని నసిగేను.

నసిగి, "ఇంతకూ మనం దాన్నెందుకు తగలేయాలి?" అని ప్రశ్నించేను.

సుబ్రావ్ మళ్ళీ గుర్రుమన్నాడు. "ఎందుకు తగలెయ్యగూడదూ?" అని ఎదురు ప్రశ్న వేసేడు.

కాన్సేపాగి నా మీద దయదలిచేడు. 'దాన్నిండా ముసలిపీనుగు లున్నారు" అన్నాడు.

"అయితే?"

"మనం పడుచు పీనుగులతో మరో అకాడమీని స్థాపిద్దాం!"

"డబ్బు?"

"అకాడమీకి ఎక్కడ్నించి వస్తోందనుకున్నావు?"

"ఏలిన వారిస్తున్నారు గదా!"

"మనకూ ఆ ఏలినవారి మొగుళ్ళ లాంటి వారిస్తార్లే!"

"మనకు వాళ్లెందు కిస్తారు?"

"చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకు? ఎందుకివ్వాలో వాళ్ళకు తెలీదనుకున్నావా?"

"సరే! మనం కుర్ర పీనుగుల అకాడమీ పెడదాం! ఆ తర్వాత?"

"అకాడమీ చెయ్యాని పనులు చేద్దాం!"

"అకాడమీ నా సావనీరుకు అడ్వర్టయిజుమెంటు ఇవ్వ లేదు గురూ! మన కుంకల అకాడమీ తప్పకుండా ఇస్తుంది గదా?"

"అవన్నీ అల్ప విషయాలు శిష్యా! మనం అకాడమీ ఇచ్చే ప్రైజులను తలదన్నే ప్రైజులిద్దాం!"

"అయితే నన్ను అర్జంటుగా ఓ పుస్తకం రాసి పడేయ మన్నావా?"

"ఆగరా, నాయనా! నువ్వింకా కుర్రవాడివి. మన ప్రైజులు చాలా పెద్దవి"

"అంటే! జ్ఞానపీఠం అవార్డు కన్నానా? గురూ?"

"అబ్బే! మనం జాక్‌పాట్లు ఇవ్వం! ప్రైజులిస్తాం. కనుక మనం ఇచ్చేది మరీ అంత ఎక్కువగా ఉండగూడదు."

"ఊఁ! తర్వాత ?"

"అకాడమీ ప్రచురించే పుస్తకాలన్నీ చెత్త".

"అవును, చెత్తే! కాలేజీలో నాకు ఆ బాపతు పుస్తకం ఒకటి తగిలించేరు. చదవలేక చస్తున్నాను. కానీ, గురూ! మన్లోమాట! వాటిల్లో కొన్నిపాఠాలు మాత్రం మాపసందుగా ఉంటాయనుకో!"

"నాన్సెన్స్! ముసలి పీనుగులా మాట్లాడకు!"

"కాదు గురూ ! నిజంగానే ! ఓ పాఠంలో రంభ ఏడుస్తూ నల కూబరుడికి చెప్పుకుంటుంది. రావణుడు తనను ఎలా చెరిచిందీ నోరూరేలా వర్ణిస్తుందనుకో! ఎక్కడ ఎలా పట్టుకున్నాడో, ఎక్కడ ఎలా నొక్కాడో, గిల్లాడో, కొరికాడో ఎంత పసందుగా వర్ణించాడనుకున్నావూ!"

"ఎవడాడు?"

"పేరు గుర్తులేదు గానీ మొత్తంమీద ఎవడో మన ముత్తాతల ముత్తాల నాటి ముసలి పీనుగే అయి ఉంటాడు".

"అదేరా, అసలు సంగతి! ముసలోళ్ళు అలాంటి పుస్త కాలచ్చేసి ప్రజాధనం తగలేస్తున్నారు."

"మరయితే మనం ఎలాంటి పుస్తకాలకు తగలేద్దా మంటావూ?"

"మనం యువ రచయితలం, యువ రక్తపు వేడి నిండిన, యువ గ్రంథాలచ్చేసి ఆంధ్ర ప్రజానీకాన్ని చైతన్యవంతుల్ని చేస్తాం."

"నీ కవిత్వం ఆపి మామూలు మాటల్లో చెప్పుగురూ".

"క్రిందటేడాది నాపుస్తకం వచ్చింది, చదివావు గదా! దాని గొప్ప దనం మన ముసలి అకాడమీకి ఏమన్నా అర్థం అయి చచ్చిందా?"

"అర్థం కాలేదు గనుకే ఇంకా బ్రతికున్నారేమో,"

"నీమాట వరహాలమూటరా! చూడూ! మనం అలాంటి మహద్గ్రంథాల్ని పుంఖాను పుంఖంగా ఆంధ్ర దేశం మిదికి అచ్చేసి వదలాల్సి ఉంది."

"ఆపని బెజవాడ ఏలూర్రోడు సాహితీ సేవకులు చేస్తు న్నారు గదా గురో!"

నాన్సెన్స్! వాళ్ళది వ్యాపారం. మనది సాహిత్యసేవ!

"అయితే అకాడమీవేసే పుస్తకాలు సాహిత్యం కాదని మనం ఢంకా బజాయించాలన్నమాట!''

"నిస్సందేహంగా!"

''మనం వెయ్యబోయేదే సాహిత్యం?"

''కాదన్న వాడు ముసలి పీనుగన్నా అయ్యుండాలి! లేదా, సదరు ముసలి పీన్గుల అకాడమీ ముష్టికోసం కాకా పట్టే వాడేనా అయ్యుండాలి.''

"మరయితే మనం వెయ్యబోయే పుస్తకాల్లో రంభల్లాంటి ఆడపిల్లలు గానీ, వాళ్ళ పెదాల, బుగ్గల వర్ణనలు గానీ, ప్రేమాయణాలుగానీ, ఉండగూడదంటావు. మరి నేనింత వరకూ రాసినవన్నీ తగలేయాల్సిందేనా? మనఅకాడమీడబ్బుతో ఒకట్టటన్నా వెయ్యవా?

''బెంగపడక! మనం యువకులం! పిలక పండితులం కాము! మనం ఈగల్ని తోలుకుంటూ, దోమల్ని తిట్టుకుంటూ కథలూ కవిత్వం రాసే ఆధునికులం. తూగుటుయ్యాలలో పవ్వళించి రంభ కూతురు అందించే కర్పూర తాంబూలాలు నములుతూ రాసే ఛాందసులం కాము. కనుక మన నవలల్లో ఏం ఉన్నా అది అభ్యుదయమే!

''నా పుస్తకాలు వేస్తానంటే నువ్వెన్ని చెప్పినా నాకు అభ్యంతరం లేదనుకో! కాని తిట్టకు గురూ! ఇంతకీ అసలు ప్రజాసేవా, సాహిత్యసేవా అంటే ఏంటి?"

'ఏంటంటే...! ఏంటంటే...! ఇప్పుడున్న అకాడమీ చెయ్యని వెధవ పన్లన్నీ చెయ్యటమే!

"వెధవ పనులా...?"

"అబ్బే మాట వరసకు అన్నానంతే! మనం వెధవపన్లు ఎందుకు చేస్తాం! ప్రజలకోసం ఏదైనా చేస్తాం గానీ!"

"మరయితే, మనం ముసలి పీన్గుల అకాడమీకి పోటీగా కుర్ర పీన్గుల అకాడమీ పెట్టటం దేనికి గురో! ప్రజలకోసం ఓ ప్రజల అకాడమీ పెట్టగూడదా?"

"శిష్యా! విను! నీ అయిడియా బాగానే ఉందనుకో కానీ,.... కానీ.... ప్రజలకు అసలు మన గొడవే పట్టదు. వాళ్ళకక్కరలేంది నీ నా పుస్తకాలూ కాదు. సాహిత్యమూ కాదు. మన్లో మాట...! ఎక్కడేనా నోరుజారేవు సుమా... వాళ్ళకక్కరలేంది ఏమిటంటావా...? కూడూ.... గుడ్డా!"

"వ్వాట్! వ్వాట్?"

"అవును తమ్ముడూ! వాళ్ళ అవసరం వాళ్ళది! మన అవసరం మనది వాళ్ళ ఏడుపు వాళ్ళది. మన ఏడుపు మనది. పద పోదాం!"

"ఎక్కడికి...?"

"మర్చిపోయావా పెట్రోల్ బంకుకి?"

(మార్చి 76)